క్లుప్తంగా

నేడు బెంగళూరులో ఆత్మీయ సమావేశం

ఉదయగిరి: బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో ఉన్న ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఉదయగిరి ప్రాంతానికి చెంది బెంగళూరు పరిసర ప్రాంతాల్లో స్థిరపడిన, తాత్కాలికంగా నివాసం ఉంటున్న ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తారు. ఈ సమాశంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొనున్నారు.

అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ టీమ్ సేవియర్స్ మహిళా విభాగం సభ్యులు

కావలి: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని రెడ్‌క్రాస్ రక్త కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ అన్నారు. శనివారం రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ లింగ వివక్షకు వ్యతిరేకంగా, మహిళా సాధికారతకు సంఘీభావంగా సమష్టి కృషి చేయాలని వివరించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పీజీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మీసాల సుశీల, టీం సేవియర్స్ ప్రతినిధులు కీర్తిప్రియ, తేజస్విని, దివ్యశ్రీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జాముని, ఉమాశర్మ తదితరులు మాట్లాడారు. సౌందర్య దీపిక మాట్లాడుతూ మహిళలు శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి రవిప్రకాష్, హరినారపరెడ్డి, రఘుకుమార్ రెడ్డి, లోకేష్, కృష్ణారెడ్డి, రమన్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మూడిళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

సంగం: మండలంలోని సిద్ధీపురంలో శుక్రవారం అర్ధరాత్రి ఒకేసారి మూడు ఇళ్లలో చోరీ జరిగింది. షేక్ మాబూజ, షేక్ మౌలాలి, శ్రీహరి ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి రూ.5 వేల నగదు, రెండు గ్రాముల బంగారు ఉంగరం అపహరించారు. ఉదయాన్నే ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్న సర్పంచ్, తహసీల్దార్

ఉదయగిరి: పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం అర్హులైన లబ్ధిదారులకు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తహసీల్దారు నెప్రాబాబు, సర్పంచ్ పి.సామ్రాజ్యం భూహక్కు పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 320 మందికి జగనన్న పక్కాగృహాలు మంజూరు చేసి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి అందించారు. ప్రతి పేదడికి పక్కా గృహం కల్పించడమే పేదలందరికీ ఇళ్లు పథకం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్ ఎంపీటీసీ పెదమస్తాని, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్థాని వీఆర్వోలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంట్రెన్స్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు: స్థానిక దేవిరెడ్డి శారదా ట్రస్ట్ హైస్కూల్లో అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న ఎంట్రెన్స్ టెస్ట్‌కు మండల పరిసర ప్రాంతాల్లోని 5వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మార్చి 3వ తేదీ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే వారికి మార్చి 10వ తేదీ ఎంట్రెన్స్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ఉచిత విద్యను అందిస్తామన్నారు. మండలంలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంట్రెన్స్ టెస్ట్‌కు వచ్చే వారు ఆధార్ కార్డును వెంట తీసుకొని రావాలని కోరారు. ఉదయం 8.30 గంటలకు ఎంట్రెన్స్ టెస్ట్ జరుగుతుందన్నారు.

'పట్టా'భిషేకం

గత ప్రభుత్వాలు పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చినా ఎక్కడో పనికి రాని ప్రాంతాల్లో అరకొరగా ఇచ్చేవి. అవి కూడా నివసించేందుకు అనువుగా లేకపోవడంతో ఇళ్లు కట్టుకునేవారు కాదు. దీంతో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నిరుపయోగంగా ఉండేవి. పేరుకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని పాలకులు చెప్పుకునేందుకు మాత్రమే పనికి వచ్చేవి.

కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆ పరిస్థితి మారిపోయింది. పేదోడికి ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఆ స్థలాలకు లబ్ధిదారు పేరుపై సర్వహక్కులు కల్పిస్తూ శాశ్వత హక్కు పత్రాలు అందిస్తున్నారు. పైగా అనువైన ప్రాంతాల్లో నూతన లేఅవుట్స్ ఏర్పాటు చేసి సకల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోంది. దీంతో అనేక గ్రామాల్లో నూతన లేఅవుట్లలో కొత్త ఊర్లు వెలుస్తున్నాయి.





వింజమూరులో హైవే పక్కనే ఉన్న లే అవుట్లలో శర వేగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

ఇళ్ల స్థలాలకు శాశ్వత హక్కు కల్పన

- పదేళ్ల తర్వాత సర్వహక్కులు కల్పిస్తూ ఇప్పుడే రిజిస్ట్రేషన్
- క్రయవిక్రయాలకు అవకాశం
- మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ఉదయగిరి: మెట్ట ప్రాంతం ఉదయగిరిలో పేదోడి ఇంటి కల సాకారం చేసే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న పేదోళ్లకు ఇంటి స్థలాలు మంజూరు చేసింది. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో మొత్తం 6,406 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఇంత వరకు 4,603 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కొక్క ఇంటి కోసం రూ.1.80 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక ఉచితంగా అందిస్తోంది. తక్కువ ధరకే ఇటుక, స్టీల్, సిమెంట్‌లను సరఫరా చేస్తోంది.

ఉదయగిరి నియోజకవర్గంలో మంజూరైన ఇళ్లు

మండలం	లే అవుట్లు	మంజూరైన ఇళ్లు	రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లు
వరికుంటపాడు	35	1,175	617
జలదంకి	26	888	724
కొండాపురం	20	366	147
దుత్తలూరు	28	647	525
కలిగిరి	38	1,037	745
వింజమూరు	19	1,340	1112
ఉదయగిరి	28	953	733
సీతారామపురం	12	560	364

లే అవుట్లలో శరవేగంగా వేగంగా మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్లలో మౌలిక వసతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. లే అవుట్లలో నీటి వసతి కోసం బోర్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీకరణ పనులు చేస్తున్నారు. అంతర్గతంగా సిమెంట్ రోడ్లు వేస్తున్నారు. నెలల వ్యవధిలోనే వెలుస్తున్న కొత్త ఊర్లు చూసి, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం అంటే ఇదే కదా! అభివృద్ధి ఇదే కదా.. అని చర్చించుకుంటున్నారు.

ఇళ్ల స్థలాలకు శాశ్వత హక్కు కల్పన

గత ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు ఇచ్చిన వాటిపై సర్వహక్కులు ఉండేవి కావు. అత్యవసర పరిస్థితుల్లో విక్రయించాలన్నా ఎవరూ కొనేవారు కాదు. ఒక వేళ కొన్నా.. అర కొర ధరకు మాత్రమే తీసుకునేవారు. కానీ నేడు జగనన్న ఇచ్చే ఇళ్ల స్థలాలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ లబ్ధిదార్ల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు అందజేస్తున్నారు. ఈ స్థలాలను ఆటోమేటిక్‌గా పదేళ్ల తర్వాత క్రయవిక్రయాలు చేసుకోవచ్చు. అంటే ఈ స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తున్నారు.

అర్హులందరికి ఇళ్ల స్థలాలు



అర్హులందరికీ ఇళ్లు స్థలాలు ప్రభుత్వం ఇస్తోంది. ఇప్పటికి అర్హత ఉండి స్థలం లేకపోతే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. పది రోజుల్లో ఇళ్ల స్థలాలు ఇస్తాం. వాటికి రిజిస్ట్రేషన్ కూడా చేస్తాం. ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా పూర్తి చేసి ఇళ్లలో చేరే విధంగా అన్నీ చర్యలు తీసుకుంటున్నాం.

– మధులత, ఆర్డీఓ, ఆత్మకూరు



లబ్ధిదార్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)

జగనన్న మేలు మరవలేం



మాకు ఇల్లు లేదు. స్థలం లేదు. స్థలం కొనే ఆర్థిక స్థోమత అంతకంటే లేదు. ఎన్నో ఏళ్ల నుంచి బాడుగ ఇంట్లో ఉంటున్నాం. జగనన్న పుణ్యామా అని మాకు స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇళ్లు కట్టుకుంటున్నాం. ఈ స్థలంపై పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు కూడా ఇచ్చారు. అంటే సుమారు రూ.10 లక్షల విలువ చేసే ఆర్థిక ప్రయోజనం కల్పించారు.

– పైడమల్ల లక్ష్మి, చాకలికొండ, వింజమూరు మండలం

జగన్‌తోనే పేదలకు న్యాయం



పేదోళ్ల బతుకులు బాగుండాలంటే జగన బిడ్డ మరలా అధికారంలోకి రావాలి. ఆయన ద్వారా నాకు పథకాల ద్వారా ఈ ఐదేళ్లలో రూ.3.70 లక్షలు వచ్చాయి. నా లాంటి ఎంతో మంది పేదోళ్లకు మేలు చేసిన సీఎం జగన్. సొంత కొడుకు కూడా చూసుకోలేని విధంగా ఆయన పేదోళ్ల బాగుగోలు చూస్తున్నారు. ఆయన్ను మరలా సీఎం చేసుకుంటేనే పేదోళ్ల జీవితాలు బాగుపడుతాయి.

– అల్లిక బాలసుబ్బమ్మ, బెస్తకాలనీ, సీతారామపురం

హైవే పక్కన ఇంటి స్థలం ఇచ్చారు



మాకు హైవే పక్కన అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఇంటి స్థలం ఇచ్చారు. మా వంటి వాళ్లకు ఈ ప్రాంతంలో స్థలం కొనే ఆర్థిక స్థోమత లేదు. జగనన్న పుణ్యమా అని మాకు రూ.7 లక్షల విలువ చేసే స్థలం ఇచ్చి మా పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఇంత వరకు మేము మా బంధువుల ఇంట్లో ఉంటున్నాం. ఇప్పుడు ఇల్లు కట్టుకుని సొంతింట్లో చేరే అవకాశం వచ్చింది. ఈ ప్రభుత్వం చేసిన మేలు మరవలేము.

– ఈర్ల మంజుల, వెంకటరమణ దంపతులు, దాసరిపల్లి, ఉదయగిరి మండలం

సంస్కారానికి, అహంకారానికి మధ్య ఎన్నికలు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలిలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో సంస్కారానికి, అహంకారానికి మధ్యే పోటీ ఉంటుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రశాంతంగా ఉన్న కావలిలో అహంకారం, రౌడీయిజంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ టీడీపీ రాజకీయం చేస్తోందన్నారు. ఇలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. పేదలకు అన్ని వసతులతో కూడిన లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు పక్కా ఇళ్లు కూడా కట్టిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో సుమారు 8 వేల మందికి సరిపడా మెగా లేఅవుట్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడుతున్నారని తెలిపారు. దగదర్తి మండలంతో పాటు పలుచోట్ల టీడీపీ నాయకులు కోర్టు కేసుల ద్వారా పేదలకు స్థలాలు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇలాంటి పార్టీలను తరిమి కొట్టాల్సిన బాధ్యత ప్రజలపైన ఉందన్నారు. కావలిలో కూడా రౌడీయిజం ద్వారా టీడీపీ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న కావలిని అరాచకశక్తులకు అడ్డాగా మార్చేలా అహంకారం, రౌడీయిజంతో గొడవలు పెంచిపోషిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పేలా ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరురూరల్: రైతులు వాతావరణ ఆధారిత వ్యవసాయం చేయడం ద్వారా లాభాలు పొందవచ్చని ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ దేవసేన అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం సబ్ డివిజన్ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. సహజ సిద్ధ వనరులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్షపు నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు వేసవి కాలంలో కాంటూరు గట్లు నిర్మాణం, వాలుకు అడ్డంగా లోతు దుక్కులు దున్నడం, వ్యవసాయ వ్యర్థ పదార్థాలతో ఆచ్ఛేదన చేయడంతో భూమిలోని తేమతో పాటు మిత్ర జీవులను సంరక్షించుకోవడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులు సేంద్రియ ఎరువులు, కషాయాలు, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలను వినియోగించి మిత్ర పురుగులను సంరక్షించుకోవడం ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు శ్రీధర్‌రెడ్డి, కిషోర్‌బాబు, రజనీ, ఐటీసీ సంస్థ ప్రతినిధి ధనుంజయ, సెడ్జ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంపీఈఓలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వ పథకాలను పేదలకు చేరువ చేయడంలో వలంటీరు అందిస్తున్న సేవలు, చేస్తున్న కృషి అభినందనీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో కావలి పట్టణ, రూరల్ మండలాల వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పౌరసేవలు, పింఛన్ల పంపిణీలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లను ఎమ్మెల్యే అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవలను పేదల ఇంటి ముంగిటకే అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వలంటీర్లు నిజాయితీగా సేవలందించడంతో ఈ వ్యవస్థ పటిష్టంగా మారిందన్నారు. ఎక్కడా అవినీతికి, నిర్లక్ష్యానికి తావు లేకుండా వలంటీర్లు సేవలు అందించి దేశానికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ఇక ముందు కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల మృతి చెందిన మూడు కుటుంబాలకు ఉత్తరక్రియల కోసం రూ.10 వేలు చొప్పున శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని 5వ వార్డు జేఆర్‌పేటకు చెందిన ఇమ్మిడిశెట్టి జనార్దన్, 19వ వార్డుకు చెందిన కె ఆదెమ్మ, 16వ వార్డుకు చెందిన ఖాజారంతుల్లా కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఆయా వార్డు కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, కొండా స్వరూపరాణి, పార్టీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, మధుసూదన్, మెప్మా ఆర్పీలు రహీనాబేగం, ఆఫ్రీన్, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, రామ్‌రెడ్డి అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

సోమశిల: మండలంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత ప్రవేశానికి, విద్యకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ కాటంరెడ్డి బాలకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు దారిద్ర్యరేఖకు దిగువనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు కేటాయించినట్లు తెలిపారు. తమ సమీప పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు ఆధార్, కులం, ఆదాయ ధ్రువీకరణ, రేషన్‌కార్డు, ఫొటోలతో సమీపంలోని సచివాలయం లేదా నెట్ సెంటర్లలో ఈ నెల 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అసభ్యకర ప్రవర్తన కేసులో నిందితుడి అరెస్ట్

కావలి: పట్టణంలోని సంకులవారితోటలో గత నెల 27వ తేదీ రాత్రి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో నిందితుడు తుఫాన్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బలగాని సురేష్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. సురేష్ సంకులవారితోటకు చెందిన తన స్నేహితుడి భార్యతో గత నెల 27వ తేదీ రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు. మహిళ ప్రతిఘటించి కేకలు వేయగా చుట్టు పక్కల వారు రావడంతో నిందితుడు పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వండి

ఆత్మకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ ఉద్యోగులు మూడేళ్లుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, జీతాల బిల్లులు మంజూరు చేయాలని యూనియన్ నాయకులు కోరారు. శనివారం రాష్ట్ర యూనియన్ కమిటీ పిలుపు మేరకు ఓపెన్ యూనివర్సిటీ శాఖల కో–ఆర్డినేటర్లకు వినతి పత్రం అందజేశారు. 2020 నుంచి జీతాలు అందడం లేదని, రాష్ట్రంలోని 96 స్టడీ సెంటర్లలో పని చేస్తున్న పార్ట్‌టైమ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు, సమస్య పరిష్కరించాలని కోరారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం

అల్లూరు: స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలో కొలువైన మహాలక్ష్మమ్మ తిరనాళ్లలో భాగంగా శనివారం అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహాలక్ష్మమ్మను ప్రత్యేక రథంపై ప్రత్యేక రంగు రంగుల పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా డీజే, కీలు గుర్రాలు, సంప్రదాయ తప్పెట్లు, మంగళవాయిద్యాల మధ్య గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. గ్రామోత్సవం అనంతరం మహాలక్ష్మమ్మ విగ్రహాన్ని యథా స్థానాల్లో ప్రతిష్టించారు.

గోశాల ప్రారంభం

అల్లూరు: మండలంలోని వెలిచర్లలో భక్తుల సహాయ సహకారంతో నిర్మించిన గోశాలను కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

జగనన్నతోనే సొంతింటి కల సాకారం



అన్నవరంలో లబ్ధిదారులకు గృహ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మాలకొండారెడ్డి

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేశాడని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి అన్నారు. శనివారం ఆయన అన్నవరం సచివాలయంలో లబ్ధిదారులకు జగనన్న గృహ రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. బ్రాహ్మణక్రాక సచివాలయంలో జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సర్పంచ్ ఇండ్ల సుధాకర్, కమ్మవారిపాళెం సచివాలయంలో సర్పంచ్ తమ్మినేని సతీష్‌నాయుడు లబ్ధిదారులకు గృహ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శివకుమార్, బాలకోటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మడి రమేష్, దామెర్ల దేవదాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి అంచనా



శనగ పంటకోత ప్రయోగాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

కలిగిరి: పంట కోతల ప్రయోగాలతో దిగుబడులను అంచనా వేయడం ద్వారా బీమా వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మండలంలో శనగ పంటకోత ప్రయోగాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనగ, మినుము, మొక్కజొన్న సాగు చేసిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి యాప్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది పంట కోత ప్రయోగాలను సక్రమంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ నర్సోజీరావు, వ్యవసాయాధికారి సురేష్, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎస్‌వై శీనయ్య, వీఏఏలు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు



మున్సిపల్ కార్యాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు హాజరైన మహిళలు

ఆత్మకూరు: పట్టణంలోని 23 వార్డుల పరిధిలో గతంలో అందజేసిన జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు మున్సిపల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. మూడు రోజులుగా ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా శనివారం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. మూడు వార్డులకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేసి ఆయా వీఆర్ఓలు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు నేతృత్వంలో లబ్ధిదారుల పేరుతో జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు అక్కడికక్కడే నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 1,537 మందికి ఇళ్ల స్థలాలు మంజూరైన విషయం తెలిసిందే. కాగా నియోజకవర్గంలోని మండలాల్లో ఇప్పటికే జగనన్న కాలనీల ఇళ్ల స్థలాలు లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్లు పూర్తి కావడంతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి శుక్రవారం అందజేసిన విషయం విదితమే.

పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



దుత్తలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఎం.హరి నారాయణన్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. బీఎల్వోల వివరాలు తెలుపుతూ ప్రతి పోలింగ్ బూత్ వద్ద బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి ప్రేమ్‌కుమార్, ఉదయగిరి, వింజమూరు కలిగిరి, దుత్తలూరు తహసీల్దార్‌లు నెప్రాబాబు, కృష్ణారెడ్డి, కిషోర్‌బాబు, యశోద, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డ్రాయింగ్ మాస్టర్‌కు గోల్డ్ మెడల్



చేజర్ల: చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ తోట కిషోర్‌కు చిత్ర కళా ప్రదర్శనలో గోల్డ్ మెడల్ లభించింది. శనివారం విజయవాడలో డ్రీమ్స్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్ర కళా ప్రదర్శనలో కిషోర్ తన అద్భుతమైన ప్రతిభ చూపించడంతో గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. గతేడాది కూడా జాతీయ స్థాయిలో అవార్డు పొందారు.